సాక్షి పెద్దపల్లి

బుధవారం । 19 । మార్చి । 2025



1న హనుమాన్ శోభాయాత్ర

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 1న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్ర ప్రచార పోస్టర్‌ను మంగళవారం వీహెచ్‌పీ జిల్లా కన్వీనర్ స్వరూప్‌కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నాయకులు నాగులమల్యాల సత్యం, మహేందర్, మణిదీప్ వేల్పుల రమేశ్, శ్రీనివాస్, మహేశ్, రాకేశ్, అభిరాం, వంశీ, అఖిల్, సిద్దు, సాయి తదితరులు ఉన్నారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్ :	6.29	5.01
పెద్దపల్లి :	6.32	5.00
సిరిసిల్ల :	6.27	5.09
జగిత్యాల :	6.33	4.59

న్యూస్‌రీల్

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం(ధర్మపురి): దొంగతుర్తి జైడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న రేవెల్లి శిరీష జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వనపర్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో శిరీష అత్యంత ప్రతిభ కనపర్చినట్లు వివరించారు. శిరీషను మంగళవారం ఆవరణలో ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉచిత డ్రైవింగ్ కోర్సులో శిక్షణ పొందేందుకు ఆసక్తి, అర్హత గలవారు ఈనెల 31 వరకు దరఖాస్తు చేయాలని బీసీ సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డి కోరారు. హకీంపేట వద్ద హెవీ మోటారు వాహనం, లైట్‌మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణను ఉచితంగా అందిస్తారన్నారు. 38రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన వారికి పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తారని వివరించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఈనెల 31 వరకు బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

31లోగా దరఖాస్తు చేయండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశపరీక్ష కోసం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ మణిదీప్తి కోరారు. మహాత్మా జ్యోతిబాపూలే, బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో 6,7,8,9వ తరగతుల్లో (ఇంగ్లిష్ మీడియం) ఉన్న ఖాళీ సీట్లలో ప్రవేశం కల్పించేందుకే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి, అర్హత గలవారు ఈ నెలాఖరులోగా అవసరమైన సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఓసీపీ-3 పీవో బదిలీ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 ఓసీపీ-3 అధికారి సుంకర మధుసూదన్‌ను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓసీపీ-3 నుంచి కార్పొరేట్ ఐఅండ్‌పీ జీఎంగా ఆయనను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు వెంటనే రిలీవ్ అయి ప్రాజెక్టు అండ్ప్లానింగ్ డైరెక్టర్‌కు రిపోర్టు చేయాలని అందులో ఆదేశించింది.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

మంథని/రామగిరి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరావు అన్నారు. రత్నాపూర్, బేగంపేటలో రూ.9లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కొత్త బ్రేకర్లతోపాటు మంథనిలో ఆయన పలు పనులు మంగళవారం ప్రారంభించారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలు అధిగమించేందుకు బ్రేకర్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. మంథని డీఈ ప్రభాకర్, ఏడీఈ కనకయ్య, ఏఈ మహేందర్‌రెడ్డి, సబ్ ఇంజినీర్ సతీశ్, సిబ్బంది శ్రీనివాస్, నవీన్ కుమార్, వడ్లకొండ రమేశ్‌గౌడ్, శివకుమార్, రాకేశ్ ఉన్నారు.

గోదారి గట్టు మీద..







గోదావరిఖని: సింగరేణి రామగుండం రీజియన్ లేడీస్ క్లబ్ సభ్యులు ఎన్‌సీవోఏ క్లబ్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలు జరుపుకున్నారు. డైరెక్టర్లు, జీఎంల సతీమణులు మాలతి, విజయలక్ష్మి, వనజ, అనిత, అలివేణి, లక్ష్మి, లలిత, వాణి తదితరులు తొలుత కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఆ తర్వాత సినిమా పాటలపై అదిరేటి స్టెప్పులేసి ఉర్రూతలూగించారు. వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

వసూలు సగమే..!

- లక్ష్యం రూ.1,687 కోట్లు.. వసూలైంది రూ.886.57కోట్లు
- నిర్దేశిత లక్ష్య సాధనకు అందనంత దూరంలో బల్దియాలు
- 100 శాతం ఆస్తిపన్ను వసూలుకు మిగిలింది 12రోజులే..

సాక్షి, పెద్దపల్లి: అభివృద్ధి పరుగులు పెట్టాలంటే పన్ను చెల్లించాల్సిందే. నగర, పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు ఆస్తిపన్ను కీలకం. దీంతో బల్దియా సిబ్బంది ఆస్తిపన్ను వసూలుపైనే దృష్టి సారించింది. నిర్దేశిత లక్ష్య సాధనకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ప్రతినిత్యం పురుగోగతిపై సమీక్షిస్తూ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నా లక్ష్యం చేరుకోవడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈనెల 31న ముగుస్తుంది. అప్పటివరకు వందశాతం వసూలుకు మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తోంది. ఏప్రిల్ 1 నుంచి బకాయిలపై 25శాతం అదనంగా వడ్డీ చెల్లించాల్సి వస్తుందని హెచ్చరిస్తోంది.

జీతాలు చెల్లించలేక ఇబ్బందులు

రామగుండం కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 50,988 నివాసాలు ఉండగా, వీటి నుంచి రూ.15.89కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ.9.51కోట్లు వసూలైంది. సుమారు 431 మంది పారిశుధ్య సిబ్బంది, 121 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరికి ప్రతీనెల జనరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.1.05కోట్లు వేతనాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఆస్తిపన్ను వసూలులో జాప్యం కావడంతో వేతనాల చెల్లింపుల్లో ఆలస్యమవుతోంది. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

గడువులోగా పూర్తయ్యేనా..

ప్రస్తుతం జిల్లాలోని బల్దియాల్లో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ పనుల్లో అధికారులు, ఉద్యోగులు బీజీగా ఉన్నారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజాపాలన, సామాజిక ఆర్థిక సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వేతోలోనూ వారు తీరికలేకుండా ఉన్నారు. ఇవి ఆస్తిపన్ను వసూలుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాదాపు మూడు నెలల పాటు బల్దియా సిబ్బంది ఈ కార్యక్రమాలతోనే బిజీగా గడపడం లక్ష్యం చేరేందుకు అవరోధంగా మారింది. మరో 12 రోజుల్లో గడువులోగా.. ఆస్తిపన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించ డం నిర్దేశిత వందశాతం లక్ష్యం చేరుకోవడం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తిపన్ను వసూలు చేస్తున్న ఉద్యోగులు

నోటీసులు జారీచేశాం



బల్దియాల్లో 100శాతం ఆస్తిపన్ను వసూలుకు బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నాం. నివాస, నివాసేతర, కమర్షియల్ కేటగిరీల్లో నాలుగు బల్దియాల్లో కలిపి 52 శాతం పన్ను వసూలు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తిస్థాయిలో వసూలు చేస్తాం. – అరుణశ్రీ, కమిషనర్, రామగుండం బల్దియా

ఆస్తిపన్ను సమాచారం(రూ.కోట్లలో)

బల్దియా	అసెస్‌మెంట్స్	లక్ష్యం	వసూలైంది	శాతం
రామగుండం	50,988	15.89	9.51	59.85
పెద్దపల్లి	12,119	5.45	3.83	70.28
సుల్తానాబాద్	5,429	2.82	1.55	54.96
మంథని	5,089	1.74	1.19	68.39
మొత్తం	2,53,361	1,687.16	886.57	52.55

పాలన చేతకాక విపక్షాలపై విమర్శలు





రంగంపల్లి వద్ద పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నేతలు, సుల్తానాబాద్‌లో కళాకారులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్
- రెండోరోజు కొనసాగిన 'గోదావరి గోస' పాదయాత్ర

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రజలు అధికారం అప్పగిస్తే పాలించడం చేతకాక ప్రతిపక్ష పార్టీ నేతలపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్ విమర్శించారు. గోదావరి గోసపై చేపట్టిన పాదయాత్ర మంగళవారం రెండో రోజు పట్టణ శివారు బందంపల్లి నుంచి బయలుదేరింది. ఆయా ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతలు యాత్రకు స్వాగతం పలికారు. ప్రగతినగర్ కూడలివద్ద తెలంగాణతల్లికి, బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, గంట రాములు, రఘువీర్‌సింగ్, రవీందర్, పెంట రాజేశ్, దాసరి ఉష, గండు రంగయ్య, జుబేర్, నటరాజ్, చంద్రశేఖర్, వైద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై అసత్య ప్రచారం

సుల్తానాబాద్(పెద్దపల్లి): కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోతుందని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. సుగ్లాంపల్లికి చేరుకున్న పాదయాత్రకు మాజీ కౌన్సిలర్ పసేడ్ల మమత మంగళహారతితో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చందర్ రాష్ట్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. కాళేశ్వరమంటే చిన్న ఆనకట్ట కాదని, మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 19సబ్ స్టేషన్లు, 21పంపుహౌస్‌లు, 200 కి.మీ. సొరంగాలు, 1,530 కి.మీ. గ్రావిటీ కాలువలతో కూడుకున్నదని వివరించారు. నాయకులు దాసరి ఉష, రఘువీర్ సింగ్, పొన్నమనేని బాలాజీరావు, పాలరామారావు, పారుపల్లి గుణపతి, సూర శ్యామ్, సందీప్‌రావు, బుర్రశ్రీనివాస్ గౌడ్, దీకొండ భూమేశ్ పాల్గొన్నారు.

ఏఐతో విద్యాబోధన సులభం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

గోదావరిఖనిటౌన్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) సాయంతో విద్యాబోధన చేయడం ద్వారా విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. స్థానిక గాంధీపార్క్ మండల పరిషత్ ప్రాథమిక, ఉర్దూ మీడియం, ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఏఐ కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన కంప్యూటర్ ల్యాబ్‌లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించడం లక్ష్యంగా ఏఐ పద్ధతి అందుబాటులోకి తెచ్చారని అన్నారు. జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఏఐ సాయంతో విద్యాబోధన ప్రారంభిస్తున్నామని తెలిపారు. డీఈవో మాధవి, ఏఎంవో పీఎం షేక్, ఎంఈవో చంద్రయ్య, జిల్లా రిసోర్సు పర్సన్‌లు ప్రవీణ్, రవి, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు పాల్గొన్నారు.

సాగునీటిని వృథా చేయొద్దు

పెద్దపల్లిరూరల్: ఎస్సారెస్పీ నీటిని వృథా చేయొద్దని, చివరి ఆయకట్టుకూ అందేలా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అప్పన్నపేట ఎస్సారెస్పీ డి–83 ప్రధాన కాలువ నీటి ప్రవాహాన్ని ఈఈ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పంటలకు అవసరమైన నీటి వినియోగంపై రైతులకు అవగాహన అవససరమన్నారు.



విద్యా బోధన తీరు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

బాలసదనం సందర్శన..

స్థానిక బాలసదనం కేంద్రాన్ని కలెక్టర్ శ్రీహర్ష సందర్శించారు. పిల్లల సంఖ్య, వసతులపై ఆరా తీశారు. పిల్లలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిధులు అవసరమైతే తనకు ప్రతిపాదనలిస్తే మంజూరు చేస్తానన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

రామగుండం/కోల్‌సిటీ/ఫెర్టిలైజర్‌సిటీ: చదువులో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రామగుండంలోని తబితా, వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమాలను ఆయన మంగళవారం సందర్శించారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితనిఖీ చేశారు. అధికారులు ఉన్నారు.



అసెంబ్లీలో మనోళ్ల వాయిస్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో తమ గళం వినిపించారు. తమతమ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలు.. కావాల్సిన నిధులు.. సదుపాయాల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఏమన్నారంటే..

సాగునీటి పథకాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట(మానకొండూర్): మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో రంగ నాయకసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన ఎల్ ఎం–6 కాలువ పనులు పూర్తి చేయాలని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల పరిధిలోని రైతులు రిలే దీక్ష చేస్తున్నారు. కాలువ ప్రభావిత గ్రామాలను సిరిసిల్ల, సిద్దిపేట ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. కాలువ పనులకు రూ.3.19 కోట్లు మంజూరు చేయాలి. నియోజకవర్గంలో ఒక హై లెవెల్ బ్రిడ్జి అవసరం ఉంది.

– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

దేశానికే రోల్‌మోడల్



మాట్లాడుతున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్నింటా అగ్రగామిగా ముందుకు సాగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన చేపట్టి కాంగ్రెస్ పార్టీ చారిత్రక నిర్ణయం తీసుకుంది. అన్ని పార్టీల నిర్ణయంతో అసెంబ్లీలో కులగణనపై కేబినెట్ ఒక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అమలు చేసింది. దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలిచింది.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలి. వీణవంక మండలంలో కల్వల ప్రాజెక్టు పూర్తి చేస్తే 7వేల ఎకరాలకు సాగేనీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిధులు ఇవ్వాలి. స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధికి నిధులు ఏవిధంగా ఇచ్చారో... హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సైతం అలాగే నిధులు విడుదల చేయాలి. హుజూరాబాద్ పరిధిలోని 107 గ్రామ పంచాయతీల్లో వందశాతం రుణమాఫీ జరగలేదు. ఒకవేళ జరిగి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధం.

– పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే

రాజన్న బోర్డు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: తిరుమల తిరుపతి తరహాలో వేములవాడ రాజన్న ఆలయానికి బోర్డు, పట్టణంలో సాంస్కృతిక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. వేములవాడ ఆలయ ఆదాయం రూ.189 కోట్లుగా ఉంటుంది. గత ప్రభుత్వం రంగురంగుల బ్రోచర్లలో అభివృద్ధి చూపించింది తప్ప ఒక్క ఇటుక కూడా కొత్తది పేర్చలేదు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెనక్కి వెళ్లిన రూ.20 కోట్ల వీటీడీఏ నిధులను తిరిగి తెప్పించి బద్దిపోచమ్మ ఆలయం వద్ద పనులు ప్రారంభించాం. రూ.35 కోట్లతో నిత్యాన్నదాన సత్రానికి శంకుస్థాపన చేశాం. ఆలయం నుంచి వెయ్యి మీటర్ల వరకు రెంతస్తుల భవనాల నిర్మాణం చేయకుండా జీవో తెచ్చారు. దాన్ని సవరించాలి.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే



కల సాకారమయ్యేనా?

పట్టణ ప్రజల సౌకర్యార్థం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 నవంబర్ 30వ తేదీన రూ.2.75 కోట్ల అంచనా వ్యయంతో జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. సుమారు రెండున్నరేళ్లు గడిచిపోయాయి. ప్రభుత్వం మారిపోయింది. పనులు అర్ధంతరంగా నిలిపోయాయి. పనులు మళ్లీ ఎప్పుడు పట్టాలెక్కుతాయని, పనులు పూర్తవుతాయని, తమ ఇబ్బందులు ఎలా తొలగిపోతాయని రైతులు, స్థానికులు, వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



'భట్టి' బడ్జెట్‌పై ఆశలు!

- స్మార్ట్ సిటీకి నిధులు దక్కేనా?
- నిజాం షుగర్స్ పై ప్రకటనపై ఉత్కంఠ
- పత్తిపాక రిజర్వాయర్ పనులు మొదలయ్యేనా?
- రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆసక్తి

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్, కొత్త ప్రాజెక్టులకు వచ్చే నిధులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్మార్ట్ సిటీ, జగిత్యాల మెడికల్ కాలేజీ, ముత్యంపేట షుగర్స్ ఫ్యాక్టరీ, పత్తిపాక రిజర్వాయర్‌కు ఎంత కేటాయిస్తారన్న దానిపై స్పష్టత రానుంది.



- కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్‌కు నిధులు రావాల్సి ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం కేంద్రం నుంచి రూ.429 కోట్లు, రాష్ట్రం నుంచి రూ.399 కోట్లు విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో మిగిలిన రూ.30 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాలని ఇటీవల మాజీ మేయర్ సునీల్ రావు సీఎంకు లేఖ రాశారు. ఈ నిధులపై బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని కరీంనగర్ బల్దియా అధికారులు ఆశాజనకంగా ఉన్నారు.
- మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామం నిజాంషుగర్స్ బకాయిలు మొత్తం రూ.250 కోట్లు ఉన్నాయి. తొలుత రూ.43 కోట్లు, తర్వాత అది రూ.192 కోట్లకు చేరింది. మిగిలిన బకాయిలు కూడా త్వరలోనే ఇవ్వనుంది. ఫార్చ్యున్ కన్సెల్టెన్సీ ప్రతినిధులను పిలిచి ముత్యంపేట ఫ్యాక్టరీ రిపేరు చేయాలా? కొత్తది ఇన్‌స్టాల్ చేయాలా? అన్న విషయాలపై నివేదిక ఇవ్వమంది. మరమ్మతులకు రూ.50 కోట్ల వరకు ఖర్చవుతుందని.. ఒకవేళ నడిపినా పదేపదే మరమ్మతుల కారణంగా నష్టాలు వస్తాయని చెప్పింది. లాభాలు రావాలంటే కొత్త ఫ్యాక్టరీ పెట్టాలని నివేదిక ఇచ్చింది. ఈ బడ్జెట్లో దీనిపై ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుదోనని ఉత్కంఠగా మారింది.
- 2022–23 మెడికల్ కళాశాల ప్రారంభం అయ్యింది. దీని హాస్టల్స్ భవన నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరు అయ్యాయి. ధరూర్ క్యాంపులో 27.5 ఎకరాలు కేటాయించారు. ఇప్పటివరకు రూ.30 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి. ఇంకా 360 బెడ్స్ ఆసుపత్రి నిర్మాణం కావాల్సి ఉంది. ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రిలోనే కొనసాగుతుంది. ఈ సారి బడ్జెట్లో మరిన్ని నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు భూములకు నీరు అందించి స్థిరీకరణ చేసేందుకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక వద్ద ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. దానికి బడ్జెట్లో చోటు ఇస్తారని పెద్దపల్లి జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్‌కు ఆదేశించారు. సుమారు రూ.2 వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుపై ఎలాంటి ప్రకటన ఉంటుందో వేచిచూడాలి.

క్లుప్తంగా

ఇసుక, మట్టి అక్రమ రవాణా



మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టరు

ముత్తారం(మంథని): ఖమ్మంపల్లిలో ఇసుక, మట్టి అక్రమంగా తరలిపోతోంది. మానేరు సరిహద్దు గుట్ట, ప్రభుత్వ భూమిలో ఎర్రమట్టితో పాటు ఇసుక రవాణా చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా.. మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టా భూమిలోంచి మట్టి తీస్తే అనుమతి కావాలంటున్న అధికారులు.. అక్రమ రవాణాపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మధూసూదన్‌రెడ్డిని వివరణ కోరగా, అక్రమ రవాణా విషయం తమ దృష్టికి వచ్చిందని, అక్రమార్కులపై చర్యల కోసం మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

సీఎంవోగా కంపెనీ వైద్యాధికారే కొనసాగుతారు

- సింగరేణి సీఎండీ బలరాం



ఎన్.బలరాం

గోదావరిఖని: సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా కంపెనీ వైద్యాధికారే కొనసాగుతారని ఆ సంస్థ సీ అండ్ ఎండీ ఎన్. బలరాం పేర్కొన్నారు. మంగళవారం సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులుతో జరిగిన సమావేశంలో ఈ విషయం స్పష్టం చేశారు. సింగరేణి వైద్యాధికారులు ఎలాంటి అపోహలు, ఆందోళనకు గురికావద్దని సూచించారు. వైద్య సేవలను కార్పొరేట్ స్థాయిలో అందించాలనే ఆకాంక్షను సాకారం చేసేక్రమంలో విలువైన సలహాలు, సూచనలు అందించే బాధ్యతలను మాత్రమే చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ (సీఎంఎస్)గా నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్పొరేట్ తరహా వైద్యాన్ని అన్ని ఏరియాలకు విస్తరించాలన్న లక్ష్యాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి సీఎంఎస్ కృషి చేస్తారని ఆయన వివరించారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి యువకుడి మృతి



అజయ్‌కుమార్

చిట్యాల: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో కిందపడి ఓ యువకుడు చనిపోయాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం లక్ష్మీపూర్‌తండా గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతనవేన అజయ్‌కుమార్(24) వ్యక్తిగత పనుల నిమిత్తం చిట్యాల మండలం ఒడితల నుంచి మోరంచపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. లక్ష్మీపూర్ తండా గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే అజయ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరించారు.

ఇటలీలో ఎల్లారెడ్డిపేట వాసి..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉపాధి కోసం ఇటలీ వెళ్లిన ఓ వలస జీవి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ రషీద్(47) రెండేళ్ల క్రితం ఇటలీకి వెళ్లాడు. కారు డ్రైవింగ్ చేస్తుండగా ప్రమాదానికి గురై సోమవారం రాత్రి మృతిచెందాడు. విషయం అక్కడి మిత్రులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా మంగళవారం సమాచారం అందించారు. రషీద్ మృతదేహం బుధవారం ఎల్లారెడ్డిపేటకు రానుంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రాణాలు పోతున్నాయి..

- ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు
- అతివేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణాలు

ఈనెల 6న
మంథని మండలం బిట్టుపల్లి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన గుండపాక ఉదయ్‌కుమార్(24) మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు.

ఈనెల 10న
మంథని–పెద్దపల్లి మధ్య కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్వచర్లకు చెందిన దొంతుల వాణి(48) మృతి చెందింది. బైక్‌ను ఇసుకలారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

ఈనెల 15న
ఆర్ఎఫ్‌సీఎల్ గేట్ మూలమలుపు వద్ద వేగంగా వెళ్తున్న ట్రాలీఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అందులోని 8మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.

ఈనెల 15న
అంతర్గాం ఎంపీడీవో ఆఫీసు సమీపంలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని ఐకేపీ ఉద్యోగి మేర్గు కుమారస్వామి మృతి చెందారు.

ఈనెల 17న
మల్యాలపల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై ఆగివున్న లారీని ఢీకొని అంతర్గాం మండలం పెద్దపేటకు చెందిన సింగరేణి కార్మికుడు బండి ప్రసాద్‌గౌడ్ దుర్మరణం చెందాడు.



సుల్తానాబాద్ శివారులోని రాజీవ్ రహదారిపై లారీని ఢీకొట్టిన ఆటో(ఫైల్)

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, మృతులు, గాయపడినవారు

ఏడాది	మృతులు	తీవ్రగాయాలు	గాయాలు
2022	128	44	296
2023	112	64	303
2024	131	221	301

గోదావరిఖని: జిల్లాలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్డెక్కితే గమ్యం చేరేంత వరకూ భరోసా లేకుండా పోతోంది. అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, సూచికల లేమి, లెక్కకు మించి మూలమలుపులు, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని అధికారులు వివరిస్తున్నారు. ప్రధానంగా బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రమాదాల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదని చెబుతున్నారు.

గతేడాది 131 మంది..
221 మందికి గాయాలు

గతేడాది జరిగిన ప్రమాదాల్లో 131 మంది మృతి చెందగా 221మందికి తీవ్రగాయాలయ్యాయి. మరో 301మంది స్వల్పగాయాల పాలయ్యారు. రాజీవ్ రహదారిపై 27 బ్లాక్ స్పాట్లను పోలీసు యంత్రాంగం గుర్తించినా.. అక్కడ ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ఆ ప్రాంతాల్లోనే ప్రమాదాలు పెరుగుతూ వస్తున్నాయి. కొన్ని ప్రమాదాల్లో గాయాలపాలైన వారు శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారు.

యంత్రాంగం నిర్లక్ష్యం..

ప్రమాదాల నియంత్రణ కోసం రోడ్డు సేఫ్టీ విభాగాన్ని ట్రాఫిక్ యంత్రాంగానికి అప్పగించారు. ఆరేళ్ల క్రితమే జిల్లాలోని బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాల సంఖ్య అప్పట్లో అదుపులోకి వచ్చాయి. ప్రస్తుతం సూచిక బోర్డులు లేకపోవడం, బ్లాక్ స్పాట్‌లు వాహనదారులకు కనిపించకపోవడం, అతివేగంతో చాలామంది ప్రమాదాల బారినపడుతున్నారు.

భారీ వాహనదారుల నిర్లక్ష్యం..

భారీ వాహన డ్రైవర్లతో నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఓవర్‌లోడ్‌తోపాటు అతివేగం ప్రమాదాలకు కారణమని అంటున్నారు. భారీ వాహన డ్రైవర్ల తీరుతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడి మృతిచెందుతున్నారు. రాత్రంతా వాహనం నడిపి నిద్రలేకుండా డ్రైవింగ్ చేయడంతోనే డ్రైవర్లు నిద్రలోకి జారుకుంటున్నారని, దీంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరిస్తున్నారు.

నియంత్రణలోకి రాక..

ట్రాఫిక్ పోలీసులు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. అయినా, మద్యం తాగి డ్రైవింగ్ చేసే కేసుల సంఖ్య తగ్గడంలేదు. రోజూ ఏదోఒకచోట మద్యం తాగి వాహనం నడుపుతూ కొందరు పోలీసులకు చిక్కుతూనే ఉన్నారు. కోర్టులు కూడా భారీగా జరిమానా విధించడంతోపాటు జైలు శిక్షణ వేస్తోంది. గతేడాది 6,725 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లు పట్టుపడగా, అందులో 3,352 మందికి రూ.44.14లక్షలు జరిమానా విధించారు. అయినా, తీరుమారడం లేనేలేదు.

నియంత్రణకు చర్యలు



నేను గతంలో పోలీస్ కమిషనర్‌గా పనిచేసి వరంగల్‌లో చేపట్టిన అనేక సంస్కరణలో 20శాతం వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. ఇక్కడ కూడా అలాంటి కఠిన చర్యలు తీసుకుంటాం. బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిపై చర్యలు తప్పవు.
– అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం

సామర్థ్యానికి మించి రవాణా



అంతర్గాం మార్గంలోని పెద్దంపేటలో నిలిపిన బూడిద టిప్పర్లు

- భారీటిప్పర్లలో బూడిద, ఇసుక, మట్టి తరలింపు

రామగుండం: అంతర్గాం నుంచి ఎన్టీపీసీ బూడిద, ముర్మూర్ నుంచి రాజీవ్ రహదారి ద్వారా చెరువుమట్టి భారీగా రవాణా అవుతోంది. గోలివాడ రీచ్ నుంచి రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ట్రాక్టర్లతో ఇసుక నిత్యం తరలిపోతోంది. ఈ వాహనాలతో గ్రామీణ రహదారులపై అలజడి రేగుతోంది. సామర్థ్యానికి మించి మట్టి, బూడిద తరలిస్తున్నారు. బుగ్గ రోడ్డు నుంచి అంతర్గాం మండల పరిషత్ జంక్షన్ వద్ద కూడలి ఉంది. అక్కడ వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ వాహనాలతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతర్గాం జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడలిలో రద్దీ అధికంగా ఉంటుంది. అయితే, మట్టి, బూడిద, ఇసుక తరలించే వాహనాలతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. మూలమలుపులు, కూడళ్ల వద్ద భారీ వాహనాల వేగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

ఉచిత ఇసుక రవాణాతో ట్రాక్టర్ల ఇష్టారాజ్యం..

గోలివాడ రీచ్ నుంచి స్థానిక అవసరాలకు ఇసుకను ఉచితంగా తరలించే అవకాశంఉంది. దీంతో ట్రాక్టర్ యజమానులు అతివేగంగా రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు మైనర్లకు ట్రాక్టర్లు అప్పగించడంతో ద్విచక్ర వాహనాలతో పోటీపడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. తద్వారా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఓవర్‌లోడ్, అతివేగంతో వెళ్తున్న వాహనాలను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. దీంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి



మట్టి, ఇసుక, బూడిద తరలించే టిప్పర్ల వేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మూలమలుపులు, కూడళ్ల వద్ద కూడా స్పీడ్ తగ్గించడం లేదు. ద్విచక్ర వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లేవారు భయపడుతున్నారు. అధికారులు ప్రధాన కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.
– గూడూరి వెంకన్న, రామగుండం

దృష్టి సారిస్తాం



అంతర్గాం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో యువకులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. టిప్పర్ల అతివేగం, ఓవర్‌లోడ్‌ను నియంత్రిస్తాం. ఇందుకోసం ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం. టిప్పర్ల రాకపోకలపై నిఘా పెడతాం.
– రంగారావు, రీజినల్ ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి, పెద్దపల్లి

భయంగా ఉంది



రామగుండం– అంతర్గాం తదితర ప్రాంతాల్లో వందలాది ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నారు. అతివేగంతో రోడ్లపైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపైకి రావాలంటేనే భయంగా ఉంది.
– వద్దెపల్లి సృజల, అంతర్గాం

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

- టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యం
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న టీచర్లు
- 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు
- ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు



మారేడుపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈసారి ఎలాగైనా వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్నెల్లుగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని సందేహాలు నివృత్తి చేస్తున్నారు.

21 నుంచి వార్షిక పరీక్షలు..

జిల్లాలోని మొత్తం 135 హైస్కూళ్లలో 7,393 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహించే వార్షి పరీక్షలకు వీరు ఫీజు చెల్లించి ఉన్నారు. రోజూ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా..

జిల్లాలో మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా జిల్లా విద్యాశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. చూచిరాతలు, అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సౌకర్యంగా ఆర్టీసీ అధికారుల సహకారంతో బస్సులు నడిపించేలా చర్యలు తీసుకుంటోంది.

అందుబాటులో వైద్య సిబ్బంది..

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను నియమిస్తారు. వారి వద్ద ఓఆర్ఎస్‌తోపాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుతారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. నీడకోసం అవసరమైన చోట షామియానాలు ఏర్పాటు చేస్తారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, బుక్‌స్టాళ్లు మూసివేయాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీచేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది.

జిల్లా సమాచారం

మొత్తం హైస్కూళ్లు	135
పదో తరగతి విద్యార్థులు	7,393
కేటాయించిన పరీక్ష కేంద్రాలు	41
ఇన్విజిలేటర్లు	586
చీఫ్ సూపరింటెండెంట్లు	41
డిపార్ట్‌మెంటల్ అధికారులు	41
అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు	2
ఫ్లయింగ్ స్క్వాడ్స్(3 టీంలు)	9

నేరుగా హాల్‌టికెట్ల డౌన్‌లోడ్..

ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు నేరుగా http://bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తద్వారా ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు ఫీజు తిప్పలు ఉండవు.

భయపడొద్దు



విద్యార్థులు మానసికంగా ప్రశాంతంగా ఉండాలి. పరీక్షలు అంటే భయం వీడాలి. ఇలా రాస్తేనే మంచిఫలితాలు వస్తాయి. ఈసారి 100శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇందుకోసం అన్ని సౌకర్యాలు కల్పించాం.
– మాధవి, డీఈవో

వంద శాతం లక్ష్యం



కలెక్టర్, డీఈవో ఈదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం. ఇందుకోసం ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.
– స్వర్ణ, హెచ్ఎం, న్యూమారేడుపాక

టిఫిన్ ఇస్తున్నరు



టెన్త్‌క్లాస్ పరీక్షల్లో మంచిమార్కులు వచ్చేలా టీచర్లు స్పెషల్ క్లాస్‌లు తీసుకుంటున్నరు. కఠిన సబ్జెక్టుల్లో అనుమానాలు తొలగిస్తున్నరు. ఉదయం, సాయంత్రం టిఫిన్ ఇస్తున్నరు.
– పి.అక్షయ, విద్యార్థి, న్యూమారేడుపాక

స్పెషల్ క్లాస్‌లతో..



మా సార్లు రోజూ పొద్దున, సాయంత్రం స్పెషల్ క్లాసులు తీసుకుంటున్నరు. పరీక్షల్లో మంచి మార్కులు వచ్చేలా కఠిన పాఠాల్లో అనుమానాలు తొలగించారు. వందశాతం రిజల్ట్ వస్తుంది.
– కె.రఘునందన్, వెంకట్రావుపల్లి

థాయ్‌లాండ్‌కు మరో విమానం

- బాధితులను తీసుకొచ్చేందుకు పంపనున్న కేంద్రం

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కొలువుల కోసమని వెళ్లి థాయ్‌లాండ్ పరిసరదేశాల్లో సైబర్ కేఫ్‌ల్లో చిక్కుకున్న యువతను ఇండియాకు తీసుకొచ్చే ఆపరేషన్ కొనసాగుతోంది. ఇటీవల అక్కడ చిక్కుకున్న యువత దయనీయ స్థితిని 'సాక్షి' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. అమిత్ షా ఆదేశాలతో మయన్మార్, థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న 540మంది భారతీయులను రెండు సైనిక విమానాల్లో సురక్షితంగా ఢిల్లీకి తరలించారు. వారిని సీబీఐ, ఎన్ఐఏ, ఐబీ తదితర దర్యాప్తు సంస్థలు విచారించిన అనంతరం స్వరాష్ట్రాలకు పంపా రు. తాజా సమాచారం ప్రకారం.. మరికొందరు భారతీయ యువతీ, యువకులు ఇంకా అక్కడ చిక్కుకుపోయారని, వారిని కూడా రక్షించేందుకు కేంద్ర హోంశాఖ మరో విమానాన్ని థాయ్‌లాండ్‌కు పంపనుందని సమాచారం. ఈ వారాంతంలోగా మరో విమానం ద్వారా వారిని తీసుకురానున్నారని తెలిసింది.





దేవతలారా రండి..

- ఆకట్టుకున్న వీరశైవుల ఖడ్గాలు
- నేడు రాజన్న రథోత్సవం

వేములవాడ: రాజన్న ఆలయంలో జరుగుతున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం వీరశైవులు దేవతలను ఆహ్వానించే ప్రక్రియలో భాగంగా వేసిన ఖడ్గాలు ఆకట్టుకున్నాయి. వీరశైవుల హావభావాలు, శరభా..శరభా అంటూ వేసిన స్టెప్పులతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. దాదాపు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీఐపీల తాకిడి పెరగడంతో క్యూలైన్లలో భక్తులకు ఎదురుచూపులు తప్పలేదు.







తప్పని తెలిసినా.. తప్పట్లేదు..

చివరి ఆయకట్టుకు సాగునీరు అందక ఎండిపోతున్న వరి పంటను కాపాడుకునేందుకు రైతులు చివరి ప్రయత్నంగా ఎత్తిపోతల పథకానికి ఉన్న ఎయిర్ వాల్వుల పైపులు విగించుకుని సాగునీరు అందిస్తున్నారు. అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హైదరాబాద్‌కు తాగునీరు దాహం తీర్చేందుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు వేమునూర్ పంప్‌హౌస్ నుంచి భాగ్యర పైపులైన్ నిర్మించింది. వీటికి రెండు విద్యుత్ మోటార్లు బిగించింది. ఎల్లంపల్లి నీటిని వీటి ద్వారా నందిమేడారం చెరువులోకి ఎత్తిపోసింది. ప్రస్తుతం ఎస్సారెస్పీ నీరు అందక ఎండుతున్న పంటలకు ఎయిర్‌వాల్వ్‌లు జీవం పోస్తున్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు, జయ్యారం, మద్దిర్యాల తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లోని వరి పంటను ఎయిర్‌వాల్వ్ వృథా నీరు ఆదుకుంటోంది. ఇలా నీటిని తరలించడం తప్పని తెలిసినా తప్పక చేస్తున్నామని కొందరు రైతులు తెలిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి